# వ్యత్యాసము

శ్రీ మాకరాజు వేణుగోపాలరాజు

హేతువాది అయిన గోపాలం బెర్నార్డ్‌షా కొలత ప్రకారం "చిరుగుల చొక్కాను కట్టుకొని అదెవరికైనా కనపడుతుందేమో అనే భయంతో తిరిగే 'లోయర్ మిడిల్ క్లాసు'కు చెందినవాడు" అదృష్టం; ఖర్మ; పాపపుణ్యాలు; యివన్నీ మానవుల దౌర్బల్యానికి, అశక్తతకు, మైలురాళ్ళని మాత్రమే ఎంచుతాడు. ఒక కవి చెప్పినట్లు మానవుడు పుట్టడమే ఒక పొరపాటు. అనుదినం తన జీవన పోరాటపథంలో యిటువంటి పొరపాట్లే వేలకువేలు చేస్తుంటాడు మానవుడు. ఆ పొరపాట్ల వ్యుత్పత్తే ఖర్మ, దురదృష్టం మొదలైన పదాలకు సాహిత్యంలో చోటిచ్చాయి. తను బి. ఏ. ప్యాసైనా తనకొచ్చే జీతం రాళ్ళు అరవై అంటే అది కర్మగా భావిస్తారు. సహోధ్యాయులు. తనకుమాత్రం అది కర్మగాదు. పొరపాటునలేదా అశక్తిచే మానవు డేర్పరచిన ఆర్థికనగ్నవికృత కోణం ఫలితం. లేదా! అతని దౌర్బల్యానికి చిహ్నం. తన జీవితపు విలువకు తగ్గట్టుగాక తన కప్పుడే నలుగురు కుమాళ్ళు కూతుళ్ళు ఉన్నారంటే అది తన దురదృష్టంగాదు. తను చేతులారా చేసినపొరపాటు. అందుకు తను విచారించడంగాని ప్రభుత్వాన్ని విమర్శించడంగాని, తన మొరటుతనాన్ని చాటుకోవడమే నంటాడు.

ఏవో పిచ్చి ఆలోచనల్తో రోడ్డుపై నడుస్తున్న గోపాలనికి గుండెలు బద్దలయ్యే ఉరిమిన ఉరుముతో తెలివివచ్చింది. అంతవరకు ప్రకృతిలోవచ్చిన మార్పు అతను గమనించనేలేదు. సాయంసంధ్యా సమయపు నీరెండ విశ్వానికో వింత సోయగాన్ని కూరుస్తుండగా బయటపడ్డాడతను. ఇంతలోనే కావరంతో క్రమ్ముకొచ్చిన మేఘాలు చిమ్మచీకట్లను పుక్కిలించడం, ఉరుములతో మెరుపులు పయ్యాటలాడడం అతడు గమనించనే లేదు. వెంకటేశానికి ఉరుమంటే తగని భయం.

పసివాడు ఎంత అడలుతున్నాడో? లక్ష్మి దగ్గరున్నా ఒప్పుకోడు. తన ఒళ్ళోఉంటే అదేమటో మృత్యువన్నా తనను సమీపించదని వాడి అభిప్రాయం. తనకూ అలాంటి మొండి ధైర్యమే అప్పుడప్పుడు కలుగుతుంటుంది. వేగం కొంపజేరాలి అనే ఆలోచన కాళ్ళకు పని జెప్పింది. ఆ కాళ్ళకు ఆరోడ్డు చిరపరిచితం గావడం వలన కాళరాత్రిలో కటిక ఎండలోకూడా నిర్విఘ్నంగా వాట్లపని అవి నెరవేర్చుతుంటాయి.

వెధవకొంప. అణా తగ్గకుండా ఆరు రూపాయలు తీసుకోవడం "ఓనరు" గారికి తెలుసుగాని; నెత్తిన రెండు పెంకులు వేయించడం తెలీదు. గట్టిగా అడిగితే ఆ కొంపకు ఉద్వాసన ఎక్కడ చెప్పాలిసొస్తుందో! తిరిగి ఆ మాత్రం కొంపైనా దొరకడం కష్టం. రాబోయే పంవత్సరమన్నా మంచికొంప జూచుకోవాలి. కొంచెం అద్దె ఎక్కువైనా ఫరవాలేదు, కొంత యింక్రిమెంటు దొరుకుతుంది గాబట్టి. రేషన్ లేకపోవడం గూడా కొంత నయమే... తిన్నపూటన్నా కడుపునిండా తినొచ్చు... చినుకులు కూడా రాల్తున్నాయి... ఈ రాత్రంతా జాగారంతప్పదుగాబోలు... పసివాడి ప్రాణం ఎంత అఘోరిస్తోందో... దూరా నెక్కడో కుక్కల మొరుగులు వినిపించాయి. ఎదురు వసారాలో కడుపులో కాళ్ళు బెట్టుకుపడుకున్న ముసిలికుక్క లేని ఓపికతో "ఖయ్" అంటూ ప్రతి పలికింది. రోజూ తనొచ్చే త్రోవలో పనిలేక కొట్లమీద కూచున్న పెద్దమనుషులు తన్నుజూచి నవ్వడం గుర్తొచ్చింది. గోపాలానికి నిర్వికారంగా పెదవులపై నవ్వొలికింది. తన గొప్పతనం చాటుకోనేందుకు మానవుడు తన కవసరం లేని కొన్ని సమస్యలు తీసుకుంటాడేమొ?

తన స్నేహితుడు ప్రసాదానికెందుకో ధనవంతులంటే మంట! పాపం! ఎగిరిపడతాడు... మరి రెండిళ్ళు దాటితే తనిల్లు... ఎవరో యేడుస్తున్నారులాగుందే... యింకెవరు వెంకటేశ్వర్లే అయి ఉంటాడు. తలుపు బార్లగా తీసే ఉంది... శక్తిలేకపోయినా గుడ్డిదీపం గాలితో హోరాహోరీ పోరాడుతోంది. లోపలడుగెట్టి కోటు విప్పి మేకుకు తగిలించాడు. పక్కమంచంలో కూలబడబోతూ... 'వెంకటేశం'! అంటూ కేకేశాడు. తండ్రిమాట వినడంతో ఆరున్నర కృతిలో దించాడు వెధవాయి ఏడుపు.

'వాడికి తీపరంలే! లేచి స్నానానికి రండి.' అంది లక్ష్మి.

'అసలెందు కేడుస్తున్నట్లు ?'

'ఏముంది. ఉరముగా నే మీరు లేక పోయారట హాజరుగా!'

'యింకెందుకులే అరవకుండా యిటు రారా!' తెచ్చిన చాకలెట్లు జేబులో నుండి తీస్తూ పిలిచాడు. ఈమాటంటే వెంకటేశానికి తెలుసు. యిటువంటి విషయాల్లో సూక్ష్మగ్రాహి.

పరుగెత్తుకురావడం చేతిలో చాకలెట్లు లాక్కునిపోవడంతో వానకురిసి వెలిసినట్లయింది. ఈ పూటకు పథ్యపుకూడే కాబోలు... తను తేంది లక్ష్మిమాత్రం ఏం జేస్తుంది ... పడుకున్నాడన్నమాటేగాని నిద్రరాందే...ఏవో ఆలోచనలు. ఏ అర్ధరాత్రో నిద్రాదేవి జోలపాడింది. ఇక నన్నా లేవరాదండీ! ఎనిమిది గంటలైతే దరిద్రం...' భార్య మేలుకొలుపులికి ఉలిక్కిపడి లేచాడు. అరచేయి శుభ్రంగా తుడిచి శ్రీకారం వ్రాసి కళ్ళద్దుకున్నాడు గోపాలం. పెకువనే లేవకపోవడం దాక్షిణాత్యులు దరిద్రంగా భావిస్తారు. ఇదే శీతలదేశీయులైతే... ఆచారాలు అలవాట్లుకూడా వాతావరణాన్నిబట్టే మారుతుంటాయి.

ముఖం కడుగుతుండగా ప్రసాద్ వచ్చాడు. కాఫీ తాగి ఆదివారాన్ని నెమరు వేస్తూ కూర్చున్నారు మిత్రద్వయం.

'నిన్నటి నీవాదన నాకేం నచ్చలేదు గోపాలం. అన్నా క్షణికమైన ఏకాంతాన్ని భగ్నపరుస్తూ ప్రసాద్.

'ఏవాదం? గతాన్ని' నెమరువేస్తూ తిరిగి ప్రశ్నించాడు గోపాలం.

'అదే! కాపిటలిజం ఉన్నంతవరకు మనకు మోక్షముంటుందని నేను నమ్మను.'

'ధనికవాదంవల్ల దేశానికి నష్టం ఉంటుందంటే నే నొప్పుకోను ప్రసాద్.'

'ధనికవాదం ఉండబట్టేగా! ఈ సాంఘిక నిమ్నోన్నతాలు.'

'అది నీ అశక్తత. ధనికవాదాన్ని నీ కనుకూలంగా మార్చుకోలేక నీవు చిత్రించుకున్న సంకుచిత వాతావరణం. కొంతమంది ధనికులు నాశనమైనంతమాత్రంలో సమానత్వంవస్తుందనుకోవడం పొరపాటు.'

'అయితే మనం చివరివరకు ఈ దరిద్రంతో...'

పొరపడుతున్నావ్ ప్రసాద్. దరిద్రం ఒక పాపమని నేను భావించను. మానవుల దౌర్బల్యం దరిద్రంరూపంలో నెత్తిన తాండవిస్తుంటుంది. దాన్ని రూపుమాపే ప్రయత్నం చేయాలే గాని ఖర్మం, ధర్మమంటూ, చేతులుముడుచుకూర్చుంటే దరిద్రం తీరదు. అయినా ఇది ఒక్క నీ, నా సమస్యమాత్రమే గాదు. అనంతకోటి నారాయణుల సమస్య. నీ పొరుగువాడు అందలాల్లో కులుకుతున్నాడంటే అది అతని ప్రయోజకత్వం గాదు. కూడబెట్టిన కానీ కానీ, కోట్లను నిలవ చేస్తుంది. అందులో అతని తెలివేం పనిచేయదు. చేయక్కరేదు. మన "రామ్" సంగతే ఆలోచించు. మూడవదండయాత్రఫలితంగా మద్రాసు జేరాడు. జూదాలు మరిగాడు. రేసుల్లో వేలకువేలు సంపాదించాడు. అంటే అది అతని ప్రయోజకత్వం గాదు. అతనిలో అంతర్లీనమైన శక్తులు ఆ వాతావరణాన్ని అనుకూలపరచుకొన్నాయి. అంతమాత్రంలో అతనో పెద్ద అదృష్టవంతుడనిగాని మనం దురదృష్టవంతులమనిగాని చెప్పడానికి లేదు. అల్లాగే మనకీ ఓ పదివేలొస్తే?...' నిర్వేదంగా ఆశగా ప్రశ్నించాడు ప్రసాద్.

'ఇదేం కథ గాదుగా...'

'కాని నీయీ తత్వాన్ని మార్చుకొనే రోజు వస్తుందనేది మరువకు గోపాలం.



"అవునుసార్! అతను ఇచ్చినమాట నిజమే. తీసుకున్నాను. ఒకటిగాదు, డబ్బైరూపాయలు"




వస్తా...' అంటూ నిష్క్రమించాడు ప్రసాద్.

పాపం! ప్రసాదానికి యీ సమాజ స్థితిగతులపట్ల ఒక విధమైన ఏహ్యభావం ఏర్పడింది. సంకుచితంగా వాతావరణాన్ని సృష్టించుకుని అమాయికంగా బాధపడుతుంటాడు.

మనుషుల్లో యింత న్యూనత, నిరీహ ఎందుకు ప్రవేశిస్తుందో? గోపాలాని కర్థం గాలేదు. ఏది ఎల్లావున్నా ప్రసాద్‌కి ఉన్న ఓర్పు తెలుసుకోవాలనే కొంతు కలిసింది.

సాలోచనగా కూర్చున్న గోపాలాన్ని భార్య పొలికేక బాహ్యలోకంలో పడేసింది. "బజారు కెళ్ళి కూరలేవన్నా తెస్తారా లేదా!" అన్న శ్రీమతి అర్ధరు నెమరువేస్తూ కూచున్నాడు. నెమ్మదిగా లేచి, చిరిగిన సంచీ తీసుకొని అరిగిన పైరు చెప్పులు రానంటున్నా కాళ్ళకు తగిలించి బయలుదేరాడు. ఎంతలేదన్నా, పావలా ఖర్చుబెట్టందే కూరలు రావు. తన జేబులో మిగిలిన అణాకాసు 'తప్ప చిత్తు కాగితం కూడా లేదు.

ఉదయం కొంపకేడ్చిన వెధవాయి ప్రసాదుగాడు ఒక రూపాయుంటే తగలడి యిచ్చిపోగూడదూ! అయినా తనడగంది ఎల్లా యిస్తాడులే! అనుకుంటూ అయ్యరు హోటల్లోని "గృహమే గదా స్వర్గసీమ" అన్న పాట చెవులు బద్దలుచేస్తుంటే మార్కెటువైపుగా వెళ్ళాడు. కూరల వాళ్ళంతా పోటీలుపడి అమ్ముతున్నారు. డబ్బున్న ధర్మాత్ముడొకాయన బేడ కూరలకే పావలా కూలిచ్చి పట్టించుకెళ్తున్నాడు. మానవుని అవసరాలు కూడా అంతస్థునిబట్టే మారుతుంటాయి గాబోలు. ఇంటిపొరుగు కామయ్య కొట్టు మార్కెటుకంతా చివరుంది. సామాన్యంగా గోపాలం లాంటి అరువుకొట్టుడుగాళ్లు అక్కడకు జేరుతుంటారు. మార్కెటంతా పోసిం తర్వాత మిగిలిన పుచ్చులు చచ్చులు, అక్కడ పోసెళ్తారు ఉత్పత్తిదారులు. కామయ్యకా కూరలు నిక్షేపంలా అమ్ముడుపోతాయి.

సంచీ మడిచిపట్టుకు కామయ్యమార్కెటుకు తోవతీస్తున్నాడు గోపాలం. మార్కెటంతా తనవైపుజూచి నవ్వుతున్నట్లనిపించింది. వెధవ మార్కెటు ఒక్కటే తోవ. సందు తోవలన్నా లేవు. తలవంచుకొనే కామయ్య పుచ్చువంకాయల ఆహ్వానాన్ని అందుకున్నాడు గోపాలం. ఆప్యాయంగా ఆ పుచ్చుల్లోనే శ్రేష్ఠమైనవి ఏరాడు. తప్పిపోయినవాళ్ళల్లో "మెరిటు" చూచినట్టు. కామయ్య లోగడబాకీ ఎత్తకపోగా

## నారసింహలేహము




బంగారు చేర్చబడినది. మేహము, నికార్క, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి- నెల్లూరు జిల్లా.

## అబలసుధ

సువర్ణము, క్వాల్షియములు కలిపి తయారుచేయబడినది. శుక్లనష్టము, గుండెదడ, నరముల బలహీనము అతిమూత్రము మొ॥ మేహ వ్యాధులను హరించును. బలమును, కాంతిని, ధాతుపుష్టిని, యిచ్చును అనేక యోగ్యతా పత్రములు కలవు. డబ్బా రు. 3-12-0 వి. పి. 0-14-0.

ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మీటాకీసు రోడ్డు - విజయవాడ-2.

మరో సవాశేరు అదనమే తీసుకెళ్ళమన్నాడు. తప్పేది గనకనా అనుకుంటూ ఆ "వార్" సరుకే సంచినింపి యింటికి జేరాడు.

సంచీ కింద దిమ్మరించడంతోనే తెలిసింది లక్ష్మికి కామయ్య కూరలని. మాట్లాడకుండా మూతివిరిచి, కత్తిపీట దభీమని కింద పడేసి, పుచ్చులతోపాటు పురుగుల్ని కూడా తరిగి నీళ్లలో విదిలిస్తున్న అప్పటి లక్ష్మిని మాట్లాడించడం అగ్గిమీద గుగ్గిలం చల్లడమేనని గోపాలానికి తెలుసు. రానున్న తుఫాన్‌నుంచి రక్షించుకొనేందుకు పేపరు ముఖాని కడ్డంగా పెట్టుకొని చదివాడు. "మీరు నెలకు వందనుండి అయిదు వందల వరకు సంపాదించాలంటే" అనే "అడ్వర్టయిజుమెంటు" తిరిగి చదువుతున్నాడు. తాటికాయంత అక్షరాల్తో "కోజేదీవుల్లో కాల్పులవల్ల 31 మంది మరణం" అన్న వారను చదివి ఎంత ధన్యులురా బాబూ! అనుకున్నాడు.

భౌతికపరిస్థితుల వత్తిడివల్ల ఆదర్శాలనేవి చాలాచోట్ల నీరుగారిపోవడం జరుగుతుంది. చిరాకుగా గడ్డం తడుముకున్నాడు గోపాలం. ముఖమంతా ముడతలు పడ్డట్టనిపించింది. దారిద్ర్యం ముసలితనాన్ని ఎంత వేగంగా తీసుకొస్తుందో గోపాలానికర్థమైంది. ఈ దరిద్రంతో తనెందుకు కుమిలిపోవాలి. తనకన్న చిన్న గుమాస్తా ప్రసాద్ అంతహాయిగా సాంసారికజీవితం ఎల్లా గడుపుతున్నాడో తనకు తెలియకపోదు. తను నిష్టగా ఉంటేమాత్రం తన పరువేమన్నా మానేజరు మిగిల్చాడా! అనవసరంగా ఎవరిదగ్గరో రెండు రూపాయలు తీసుకున్నాడని మానవత్వాన్ని విడిచిపెట్టి మానేజరన్న మాటలు యింతవరకు తన గుండెల్ని పిండుతోనే ఉన్నాయి. తనూ ఆ నైచ్యాని కాశించితే తన లక్ష్మి తను ఈ ఏభయిరెండు మాసికల కొంపలో కామయ్య పుచ్చువంకాయలతో కాలం వెళ్లబుచ్చే ఖర్మమేమటి? నిజానికి లక్ష్మి తనవల్ల సుఖపడ్డదెప్పుడు, లక్ష్మి సంగతి గుర్తుకురాగానే గోపాలం బుర్ర వేడెక్కిపోయింది. ఇక ఆలోచించలేకపోయాడు. తుండు భుజాన్నేసుకొని తిన్నగా ప్రసాద్ యింటికి వెళ్ళాడు. అప్పుడే భోంచేసి లేస్తున్న ప్రసాద్ గోపాలం యీ అకస్మాత్తు ఆగమనాన్ని చూచి విస్తుపోయాడు.

"ఏమిట్రా యీ సమంలో వచ్చావ్! భోంచేశావా?"

"లేదుగాని! నువ్వు పార్టీలదగ్గర లంచమెట్లా తీసుకుంటావురా?"

ఏమిట్రా అర్థం లేకుండా మాట్లాడుతున్నావ్?" "తెల్లబోతూ అడిగాడు ప్రసాద్.

"ఏం లేదు. ఎందుకలా అయిపోతావు? అది తీసుకునే విధాన మేమిటని."

"ఇప్పటికి బుర్ర తిరిగిందన్నమాట. మడిగట్టుకున్నా మైలబడ్డారనే ఈ లోకంలో, మైలబడడమే చాలా మంచిదిరా. ఏముంది, నీదగ్గరకొచ్చినవాడిపని తడిపిపెట్టి ఉంచు. అతనే నేర్పుతాడు నీకు పాఠం. అయినా నువ్వు హెడ్‌క్లర్కువి నీకేంటి."

ఈ ఆలోచన బాగుం దనుకున్నాడు గోపాలం. లేచి బజారునబడ్డాడు.

"అదేమిట్రా భోంచేసి వెడుదువుగాని ఉండరా!"

"లేదురా! యింటికి వెడతాలే."

తేలికబడ్డ మనస్సుతో రోడ్డునబడ్డాడు గోపాలం. "మనసున మల్లెలమాలలూగెనే" ఎక్కడో గాలిలో తేలిపోతూ కమ్మగా వినపడింది. కొంచెంసేపు నిలబడివిన్నాడు. రేపు తప్పకుండా యీ సినీమా కెళ్ళాలి. ముందుగా వాడి హైస్కూలు జీతం గట్టాలి. నెలరోజుల్లో మంచిల్లేదన్నా అద్దెకు తీసుకోవాలి. రామయ్య కొట్టుకెళ్లి లక్ష్మికి మంచివి నాల్గు చీరలన్నా తేవాలి. స్కూలుకెళ్ళేవాడికి అసలే లేవు. వాడికో రెండు మూడు జతలన్నా కుట్టించాలి. తనకు ధోవతుల్లేవు. మంచివి రెండు ధోవతులు రెండు షర్టులయితే తనకు సరిపోవచ్చు. హోదాకు తగ్గ కోటు కూడా ఒకటి ఉంటే?

ఆలోచనలో ఈ రోడ్డంతా ఊరికెనే గడిచిపోయింది. భోంచేసి అలా షికారు వెళ్దామనుకున్నాడు. పన్నెండుగంట లప్పుడేం షికారన్న ఆలోచనే పోలేదు. తన ఆఫీసులో పలనుండి వచ్చి రెండురోజులుగా రోడ్లంట తిరుగుతున్న రైతు కాఫీ హోటలు ముందే కనిపించాడు. వెదకపోయిన తీగ కాలికి తగిలినట్లయింది. ఇకిలిస్తూ నమస్కారబాణం వదిలాడు రైతు. ఇతని పని పూర్తిజేస్తే ఎంతలేదన్నా నలభైరూపాయలన్నా రావచ్చు.

"మీ రింకా యిక్కడే ఉన్నారా?"

"చిత్తం! ఏదండీ? పని పూర్తికాందే?"

ముఖమాటపుముందు మాటలయిపోయినై. తరువాత ఏం చెయ్యడానికీ తోచక హోటల్లోకి త్రోవతీశాడు గోపాలం. కుష్కించిన తన దేహాన్ని కుర్చీలో సురక్షితంగా జేరవేశాడు. సర్వర్ ఏంకావాలి సార్ అంటూ ప్రవేశించాడు. సర్వరు మాట వినిపించుకోకుండా చేతులు నలుపుతూ నించున్న రైతువైపు జూచి కూచోండి అన్నాడు. కూచోగానే రైతే రెండుదోశల కార్డ


వైబ్రో
గర్భాశయ రోగనివారిణి

సర్వ గర్భాశయ వ్యాధులను పూర్తిగా పోగొట్టి, సత్సంతానమును కలుగజేయుటలో మా వైబ్రో మిక్కిలి ఘనతవహించినది. అన్ని షాపులలో దొరకును.

రు 2-8-0

KL
కృష్ణా లేబరేటరీ
★ బెజవాడ ★

నపుంసకతైలం

అంగ నరములు బలహీనతచెంది చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ. 10/ కల్దార్ వి.పి. రూ 1-0-0.
ఆర్డరుతో రు 1/- పంపవలెను.
డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్
మలకపేట బిల్డింగ్స్,
హైద్రాబాద్, దక్కన్.

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మసి, రాజమండ్రి.

రిచ్చాడు. దోసెతుంపుతూ "పనులంటే మాటల్తో కావండీ! యీవల మా కష్టనిష్ఠూరాలు మీరు కనిపెడుతుండాలి." మాటలు సవ్యంగానే దొర్లినందుకు సంతోషిస్తూ తుంపిన దోసె ముక్క, పళ్ళమధ్యకు నెట్టాడు. గొంతులో పట్టుకున్నట్లుంది. "ఫాన్" తిరుగుతున్నా ఎందుకనో ఉక్కపోస్తోంది. "చిత్తం! తమరిట్లా సెలవిస్తే మొన్ననే ప్యూన్‌తో చెప్పాను, ఏభయి కంటే యివ్వలేనని"

గోపాలని కాశ్చర్యం వేసింది. ఏభయి రూపాయలే! అనుకున్నాడు. ఈవ్యాపారం మంచిదే. వెధవ ప్యూనొక దొంగన్నమాట. తనకా సంగతి చెప్పాడేగాదు. ఆఫీసులో అంతా పాలిదొంగలే అయ్యారు. మరి కొంచెం బెట్టుజేస్తే పని సులువుగా జరగొచ్చు. ఎలా అడగాలో తెలియలేదు. మాటరాందే! వెధవ భయం ఈసమయానికే! ఖాళీప్లేటులో చెయికడిగి చొక్కాతోనే చెయ్యితోపాటు చెమట కూడా తుడిచి పొగలుగక్కే కాఫీ పైకెత్తాడు గోపాలం. గుండీ సరిజేసుకున్నట్లు గుండెమీద చెయ్యి వేసి చూశాడు, చాలా వేగంగా పని జేస్తోంది; నెమ్మదిగా రైతులేచి దగ్గరకొచ్చి చేతులో బలవంతంగా పెడుతూ "కరుణించండి" అన్నాడు. చేతులు వణుకుతున్నాయి. చొక్కా తడిసిపోయింది పూర్తిగా. తొందరగా చిరిగిన జేబులోనే నోట్లను కుక్కి కోటుసరిజేశాడు కనపడకుండా! "రేపు ఆఫీసుకురండీ" అంటూ రోడ్డున బడ్డాడు. అంతా తనవైపే చూస్తున్నట్లనిపించింది గోపాలానికి. వంచిన తలెత్తకుండా నడక వేగంచేశాడు గోపాలం. దడదడలాడుతూ మోటారుసైకిలు దూసుకుపోయింది ప్రక్కగా. అబ్బ! నెమ్మదిగా ఏడవగూడదూ. గుండెలో గుద్దినట్టు ఏమిటామోత అనుకున్నాడు తలెత్తేసరికి "లంచగాండ్లు" నశించాలంటే విశ్వేశ్వరరావుకేమీ ఓటు" అనే వాల్‌పోస్టరు కొట్టవచ్చినట్లు తాటికాయంత అక్షరాల్లో కళ్ళుర్మింది. కాళ్ళు వణికాయి. మెయిన్ రోడ్డు వదలి గొందిలో పడి నడక వేగం మరొకస్థాయి హెచ్చించాడు. ప్రభుత్వం దీన్ని తప్పుగా భావించడం సరైందేననుకున్నాడు. పొరపాటున అత నెళ్ళి మేనేజరుతో చెప్పడుగదా?...డబ్బు జేబులో పెట్టుకొనేటప్పుడు సర్వరు వెధవ తనవైపే జూస్తున్నట్లుంది. గడపెక్కగానే ఒక్కసారి వెనుదిరిగి చూశాడు. లోపలకెళ్ళి తలుపు దభీమనివేసి వణుకుతున్న చేతుల్తో నెమ్మదిగా నోట్లుతీసి లెక్కపెట్టాడు ఆరు పది రూపాయలనోట్లు రెండు అయిదు రూపాయలవి. చాలాఎక్కువే యిచ్చాడు తన అంచనా వేసుకోవడమే తప్పు. మరి కొంచెం అడిగినా యిచ్చేవాడేమో! తన భార్యకు నాల్గుచీరలు కోరినవి ఒక్క రోజులోనే వచ్చాయి. హైస్కూలు జీతం కట్టాలి వేగం. స్కూల్లో పేరుతీసేస్తారని భయపడుతున్నాడు పాపం. మొదటనుండీ యీ పద్ధతే అవలంబిస్తే తనకీ దరిద్రం ఉండేదిగాదేమో? అనిపించింది. పెట్టెలో డబ్బు భద్రంజేసి చిట్టిని ఎగరేసి ముద్దెట్టుకున్నాడు. ఆ రోజంతా చాలా హుషారుగా బజార్లన్నీ తిరిగొచ్చాడు.

ఉదయం ఆఫీసుకెళ్ళే గోపాలనికి ఏదో బెరుకు బెరుగ్గా ఉంది. ముందే ఎదురైన ప్రసాద్ నవ్వుతూ మరో గదిలోకి పోయాడు. గోపాలనికి అనుమానం వేసింది కొంపదీసి ప్రసాద్‌కు తెలిసి ఉండదు గదా? ఆ! నా ఊహగాని అతని కెట్లా తెలుస్తుంది. అసిస్టెంటుక్లర్కు "శాల్యూట్"చేసి వెనక్కుచూస్తూ వెళ్ళాడు ఎందుకు అల్లా చూస్తాడు దెయ్యంబట్టినవాడిలా అనిపించింది. అంతా తన్నారోజేదో కొత్తగా పరీక్షిస్తున్నట్లుంది. వరండాలో రైతు నవ్వుతూ కనిపించాడు, కొంపదీసి ఇతనేం చెప్పిఉండడు గదా? ఎందుకల్లా నవ్వుతాడు! మేనేజరుమాట గుర్తుకొచ్చేసరికి గోపాలానికి కలం పనిచెయ్యలేదు ముచ్చెమటలు పోశాయి. "ఫాన్" ఆడుతోందో! లేదో! అని పైకి చూశాడు. త్రిదశల్లో కుళ్ళు రోగాల్లో కుమిలిపోతుండే మనుషులే పనిజెయ్యగా లేంది విరామం లేకుండా ఇక యంత్రానికా రోగం అనుకున్నాడు. టైపుమెషిన్ శబ్దాలు గుండెల్లో నగారామోగించినట్లున్నాయి. ఎందుకంత ధ్వని? నెమ్మదిగా చేయగూడదూ? టైపు. ఏదో అరిపోయినట్టు.

మేనేజరు ఆఫీసులో "బెల్" మ్రోగింది. గోపాలానికి గుండెల్లో "సైరు" పేలినట్లనిపించింది. చెవుల్లో ఏదో హోరు ఏంటీ మోత? తుపానులా! ఆఫీసుపైన ఏదన్నా విమానంకూలి పోవడంలేదుగదా? ప్యూన్ వచ్చి "మేనేజరు రమ్మంటున్నారుసార్" అన్నాడు. పిడుగుపడ్డట్లనిపించింది. ప్యూన్‌ను ఎగాదిగా చూశాడు. అయినా

రు 1000 బహుమానం
లెపర్స్ క్యూర్
(రిజిష్టర్డు)
కుష్ఠు, బొల్లి, సుఖరోగాదులకు గ్యారంటీ చికిత్స.
అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.
లక్ష్మి అండ్ కో
(రిజిష్టర్డు)
H. O. వాల్తేరు ఆర్. యస్.
బ్రాంచీలు:
2/135 బ్రాడ్వే, మదరాసు.
గాంధీనగర్, విజయవాడ.
కటక్, సికింద్రాబాదు,
రాజమండ్రి etc.

చేతిపనుల వర్తకరహస్య బోధిని
50 రూపాయలనుంచి 500 రూపాయల వరకు నెలకు సంపాదించవచ్చును. ఇందు సబ్బు దినుసులు, సెంట్లు, అత్తరు, హేరాయిల్స్, పిప్పరమెంటు, వార్నిష్, వర్ణములు, పన్నీరు, షర్బత్తు ఊదువత్తులు, కర్పూరం, సిరా దినుసులు, గిల్టుయిచ్చే విధము, ఫోటో ఎత్తువిధము, బాణసంచా, మందులు, సులభముగా తయారుచేయు పద్ధతులతో 100 పేజీలు గల పెద్దపుస్తకము. వెల. రు. 1-8-0, పోస్టు ఖర్చు 6 అణాలు. మహారాజ పుస్తకశాల, 2, అరుణాచలమొదలి వీధి, మద్రాస్.

ఒక గంటలో యౌవ్వనము
కామస్తంభన
ధాతుపుష్టి, సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది. విరాశచెందిన వృద్ధులయందు శక్తి, ఉత్సాహము నిచ్చును. రు. 2-8-0
మదన మంజరి ఫార్మసీ
184, చైనా బజారురోడ్డు, మద్రాసు.
బెజవాడ—శ్రీనివాస మెడికల్ —ర్పు పార్కు రోడ్డు, రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో, మెయిన్ రోడ్డు, నెల్లూరు: ఆర్యన్ ఫార్మసీ.

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో; రాజమండ్రి

అందరూ తీసుకోనగా లేంది తనుతీసుకొంటే మేనేజరుకింత ఉక్రోషం ఎందుకో? అనిచ్ఛాపూర్వకంగానే కాళ్లు నడుస్తున్నాయి. మేడకూలి తనపై పడుతుందా? అనిపించింది. శక్తి కొద్దీ తలుపు నెట్టాడు. మేనేజరుకు నమస్కారం పెట్టాలనే విషయమే గుర్తుకు రాలేదు. అచేతనంగా నిలబడ్డాడు.

చెవుల్లో ఏదో హోరు, ప్రళయంలా... ఆర్తనాదంలా...

"ఏం! గోపాలం! నిన్న నీకు..."

"అవును సార్ ఇచ్చినమాట నిజమే తీసుకున్నాను. ఒకటిగాదు. డబ్భై రూపాయలు" ఆవేశం కట్టలు తెచ్చుకుంది భయాన్ని వరదలో నెట్టింది. "ఫుల్‌స్టాప్" లేకుండా పోతోంది ప్రవాహం.

"ఈ ఆఫీసులో తీసుకోనంది ఎవరు? చివరకు మీరు గూడా తీసుకోనంగా లేని తప్పు గర్భదరిద్రంతో ఆకులు మేసే నేను తీసుకుంటే..."

"గోపాలం!" గర్జించాడు మేనేజరు. అతని అప్రస్తుత ప్రసంగాన్ని ఆదాముపునే ఉద్దేశంతో.

"ఏం! కాదంటారా? ప్రసాద్ లంచం తీసుకుంటాడు. మీరు తీసుకుంటారు. వెంకటేశ్వర్లు తీసుకుంటాడు. లేదంటారా? ప్రూఫ్ చేస్తా చెప్పండి.

"నే చెప్పేదివిను గోపాలం?"

"వినేది లేదు సార్? చివరకు మా ప్యూన్ గూడా లంచగొండే ఈ ఆ..."

"ప్యూన్!"

"సార్!"

"ఇతన్ని బైటికి పంపు."

"నా సంగతి చెప్పందే కదలను సార్! చెప్పండి శిక్ష ఏమిటో డిస్మిస్ చేస్తారా! చెయ్యండి."

"నే తిరిగి నీకు చెప్పేవరకు నీపని నువ్వు చేసుకుంటూ ఉండువెళ్లు! ప్యూన్!"

ప్యూన్ సహాయంతో బలవంతంగా తన కుర్చీలోకి జేరాడు గోపాలం. గోపాలం వరసజూసి ఆదుర్దాతో వస్తున్న ప్రసాద్ తన గుట్టు రంగంలోకి రావడంతో కిక్కురుమనకుండా జారుకున్నాడు. మిగతా గుమాస్తాలు ఎవరికి వారే చల్లగా జారారు. టైపిస్టు ఈ గోల వినడమే ప్రమాదంగా తన చేతులకు మరికొంత పని కల్పిచ్చి చెవుల్ని సురక్షితంగా కాపాడుకుంటున్నాడు. రైతే ప్పుడో! రోడ్డుబట్టాడు.

గోపాలానికేం అర్థంగావటం లేదు. పర్యవసానం ఏమైందీ తెలియలేదు. వచ్చే డిస్మిస్ ఎలాగు వస్తున్నా హృదయం మాత్రం తేలిక పడిందనుకున్నాడు.

మెషిన్‌లా తన పని సాయంత్రంవరకు చేసుకుని ఇంటికి జేరాడు. ఎక్కడిదో ఉత్తరమొచ్చింది. కవరుచించి చదివాడు. గోపాలనికి ఆశ్చర్యమేసింది. అది తన మేనేజరు వ్రాసింది. డిస్మిస్ ఆర్డరు ఆఫీసులోనే చేతికివ్వక యింటికెందుకు పంపాడో అర్థంగాలేదు. చదవసాగేడు. ఏదో ఉత్తరం.

"గోపాలం! మానవులతో నీకు పరిచయమై దాదాపు నలభై వసంతాలు గడుస్తున్నా వాళ్ల పద్ధతులు, ఆచారాలు, సాంప్రదాయాలు, యింతవరకు తెలుసుకోలేక పోయావు. తప్పుఅన్నది మానవ జీవితంలో అడుగడుగునా జరిగేది. తప్పు చేయడంవల్ల పాపం గాని, ప్రమాదం గాని ఏమీ ఉండదు. అది సాంఘిక సాంప్రదాయం. అయితే తప్పువల్ల కలిగేఫలితం ఎప్పుడంటే అది బహిర్గతమైనప్పుడు. ప్రసాద్ లంచం తీసుకున్నాడంటే అది అతనికేం పాపంగాదు. పైపెచ్చు హాయిగా జీవిస్తున్నాడు సాంఘిక గౌరవాలందుకుంటూ. కాని అదే అందరికి తెలిస్తే సంఘంలో అతడొక తుచ్ఛుడులా పరిగణించబడతాడు.

"అభ్యుదయ సమాజంలో జరిగే పరిణామాలన్నీ తెరమరుగున జరిగేవి. సాంఘికమైన ఈ సాంప్రదాయాన్నెరుగక లేక తప్పునుజూచి భయపడుతూ నీవు తప్పు జేశావు.

"నీ అంతర్గత దౌర్బల్యం నిన్ను అందుకు బానిసగా ఉండనివ్వలేక వెళ్ళగక్కింది. నాయీ సలహా నీ జీవితాధ్యాయంలో కొత్త చిగురుల్ని తొడగగల్గుతుందనే ఆశతో యిస్తున్నాను. తప్పు సహజమైంది. దాన్నిజూచి భయపడడం పతనాన్ని ప్రోత్సహించడం. ప్రకృతి శక్తుల్ని అధిగమించడం ఎవరికీ చేతగాదు. నీవెంత మడిగట్టుకున్నా, సాంఘికవాతావరణం, నిన్ను తప్పుకు బానిసగా జేసితీరుతుంది.

"ముందు ముందైనా మెలకువతో ప్రవర్తించగలవనే నమ్మికతో ఈ సలహా యిస్తున్నాను. రేపటినుండి నీపని నువ్వే చూచుకోగలవు."

ఇట్లు
మేనేజరు.

గోపాలం ఆశ్చర్యపోయాడు... మానవత్వం లేదనుకొన్న మేనేజరు, మానవాతీతుడులా కనిపించాడు. జ్ఞానోదయమైన గోపాలం, జీవితంలో కొత్త ఆశలు రుచిచూసేందుకు సంతోషంగా ఆఫీసుకెళ్లాడు.

★

## చక్కిలిగింతలు !



ఒక లావు పాటాయన కిక్కిరిసిన బస్సులో కెక్కాడు. టిక్కెట్ డబ్బులకోసం జేబులో మూడుసార్లు చెయ్యిపెట్టి మూడుసార్లు విఫలుడయ్యాడు. చివరికి పక్కన నిలబడ్డ మరొకాయన కోపంగా అడిగాడు.

"మీ ఉద్దేశ్యం మీ టిక్కెట్ డబ్బులు నేనిచ్చుకోవాలనా?"

"అబ్బే! నేనే ఇచ్చుకుంటాను."

"మరి మూడుసార్లు నా పక్క జేబులో చెయ్యి పెడితే ఏమిటిదానర్థం?"

* * *

భార్యాభర్తలు నగల కొట్లోకి వెళ్లి గంటసేపైంది. భర్తకు విసుగు పుట్టింది.

"ఇదుగో సుశీ! మనం ఎల్లాగూ ఏమీ కొనబోవటం లేదల్లే ఉంది. ఈ చూసే దేదో కాస్త ఖరీదైనవే చూస్తే బావుంటుంది."